

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.77,810
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,040
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.88,000
రిటైల్ వెండి గ్రాము రూ.91.00

క్లుప్తంగా

ముగిసిన శిక్షణ



సీనియర్ ట్రైనీలను సన్మానిస్తున్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవ సంస్థ, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి శ్వేత భవనంలో గత ఐదు రోజులుగా న్యాయమూర్తులకు జరిగిన మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ శిక్షణ తరగతుల్లో చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు చెందిన 30 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఢిల్లీకి చెందిన మాజీ న్యాయమూర్తి హరీష్ దుడాని, మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ న్యాయమూర్తి గిరిబాలసింగ్ శిక్షణ ఇచ్చారు. వీరిని తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి జీ.రామ్‌గోపాల్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎంఎస్.భారతి పాల్గొన్నారు.

23న తిరుపతిలో భక్త సమ్మేళన వేడుకలు



మాట్లాడుతున్న పరిషత్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద

తిరుపతి కల్చరల్ : రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో తిరుపతి- తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో 6వ భక్త సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వేడుకల్లో దేశంలోని రామకృష్ణ మఠాలు, మిషన్లకు చెందిన 12 మంది ప్రముఖ స్వామీజీలు, మాతాజీలు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అధికారంతో తమ్ముళ్ల అరాచకం

- పచ్చని చెట్లపై పచ్చనేతల ప్రతాపం
- వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన మామిడి చెట్లు నేలమట్టం
- పొలానికి వేసిన కంచెను కూల్చేసిన వైనం
- భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

భాకరాపేట: అధికార మదంతో తెలుగు తమ్ముళ్లు అరాచకం సృష్టిస్తున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ నేతలపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. వారి వ్యవసాయ భూములపై విచక్షణా రహితంగా విరుచుకు పడుతున్నారు. ఇలాంటి ఘటనే చిన్నగొట్టిగల్లు మండలం, భాకరాపేట గ్రామ పంచాయతీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక సర్పంచ్, మాజీ సైనికుడు సాకిరి భూపాల్ వైస్సార్‌సీపీ మద్దతుదారుగా ఉంటూ గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేశారు. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నేతలు అతనిపై పలుమార్లు దాడికి ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో అతని వ్యవసాయ క్షేత్రంపై విరుచుకుపడ్డారు. మామిడి మొక్కలను విరిచేశారు. మామిడి తోటకు కంచెగా నిర్మించిన రాతి స్తంభాలను ధ్వంసం చేశారు.



మామిడి మొక్కలను నాశనం చేసిన దృశ్యం



మాజీ సైనికుడు అన్న గౌరవం కూడా లేదు

సాకిరి భూపాల్ రాజకీయాల్లోకి రాకముందు భారత సైన్యంలో పనిచేశాడు. పదవీ విరమణ చెందిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన భూమిలో మామిడి, కొబ్బరి, టేకు చెట్లను సాగుచేసుకుంటున్నాడు. మాజీ సైనికుడు అన్న గౌరవం కూడా లేకుండా పచ్చ పార్టీ నేతలు ఇలా పచ్చని చెట్లను నరికి వేయడం పట్ల స్థానికులు రగిలిపోతున్నారు.

రూ.50 లక్షలకు మేర నష్టం

భూపాల్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో 270 మామిడి చెట్లు, 220 టేకు చెట్లు, 12 కొబ్బరి చెట్లు, 3 సోలార్ సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్టు బాధితుడు వాపోయాడు. సుమారు రూ.50 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు బాధితుడుని పరామర్శించారు. చట్ట ప్రకారం పోరాడుదామని ధైర్యం చెప్పారు.

> **భూపాల్‌కు అండగా ఉంటాం**
>
> 'భూపాల్ పంట పొలాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. పచ్చని చెట్లను నరకడానికి వారికి మనసు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. ఇలా రాజకీయ కక్షలతో పంటలను ధ్వంసం చేయడం చంద్రగిరి చరిత్రలో జరగలేదు. పోలీసులు వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి. లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతాం. బాధితుడు భూపాల్‌కు అండగా నిలబడతాం'
>
> – చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్

సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ పోటీలకు ఎంపిక



ఎంపికైన జట్టుతో కళాశాల అధికారులు, కోచ్, మేనేజర్

తిరుపతి సిటీ: కేరళలోని కాలికట్ యూనివర్సిటీ వేదికగా శనివారం నుంచి జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) ఫుట్ బాల్ జట్టును ఎంపిక చేశారు. వ్యాయమ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్‌రెడ్డి పర్యవేక్షణలో క్రీడాకారులకు శుక్రవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. మేనేజర్ పురుషోత్తంరావు, కోచ్ ఎం విజయ్ పాల్గొన్నారు.

శానంబట్లలో మైనింగ్ అధికారుల దాడులు

– హిటాచీతో పాటు ట్రాక్టర్లు, టిప్పర్ సీజ్

చంద్రగిరి: అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్న వారిపై మైనింగ్ అధికారులు దాడులు చేసిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని శానంబట్ల సమీపంలోని స్వర్ణముఖినది వద్ద చోటు చేసుకుంది. గత కొంత కాలంగా శానంబట్ల, నరసింగాపురం కేంద్రంగా భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మైనింగ్ అధికారులు దాడులు చేపట్టారు. ఇసుక తోడుతున్న హిటాచీ, రెండు ట్రాక్టర్లు, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అపై వాటిని చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులునమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన మైనింగ్ అధికారులు

ప్రజల దృష్టిని మరల్చేందుకే

ఇసుక అక్రమ రవాణా మండల వ్యాప్తంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నరసింగాపురం గ్రామంలో ఏకంగా ఆర్డీఓకు ఇసుక దోపిడీపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో ఆగమేఘాలపై అధికారులు మొక్కుబడిగా దాడులు చేపట్టి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాగయ్యగారిపల్లి, నరసింగాపురం, చంద్రగిరి, బుచ్చినాయుడుపల్లి స్వర్ణముఖినదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పుట్టాలమ్మ సేవలో అమెరికా బృందం



సంతవేలూరులో ప్రముఖ రోబోటిక్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమిత్ కిషోర్

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గ్రామ దేవత పుట్టాలమ్మ ఆలయాన్ని అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ప్రముఖ రోబోటిక్ హార్ట్ సర్జన్ డాక్టర్ అమిత్ కిషోర్, ఆయన బృందం శుక్రవారం దర్శించుకుంది. గతంలో పుట్టాలమ్మ ఆలయ నిర్మాణ సందర్భంలో డాక్టర్ అమిత్ కిషోర్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారత్ పర్యటనలో భాగంగా సంతవేలూరు గ్రామానికి వచ్చి పుట్టాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట ఆలయ వ్యవస్థాపకులు, అమెరికా పౌరుడు డాక్టర్ మాయాని చెంచుమునస్వామి రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,165 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,377 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది.

ఆర్థిక అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

తిరుపతి అర్బన్: పొదుపు సంఘాల బలోపేతానికి డీఆర్‌డీఏ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. తిరుపతి డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సభ్యులకు అందాల్సిన రుణాల్లో ఆర్థిక అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబును ఆదేశించారు. ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన... అక్ష్యరాస్యత సాధించడానికి సంఘాలకు చెందిన లీడర్లు కృషి చేయాలని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ జిల్లాలోని 34 మండలాల పరిధిలో 34,040 పొదుపు సంఘాలు, అందులో 3,40,754 మంది సభ్యులు వెల్లడించారు. డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారిని లక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లో కనాథం,జెడ్ఎంఎస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జిల్లా సమాఖ్య సమావేశం అనంతరం డీఆర్‌డీఏ అధికారి వెంకటేషన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఆ మేరకు ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని పొదుపు సంఘాల సభ్యులు ఎంపిక చేసుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పీ.హేమలత(పాకాల మండలం), కార్యదర్శిగా కే.మోహన్‌కుమారి (తిరుపతి రూరల్), ఉపాధ్యక్షురాలిగా వీ.సుప్రజ (శ్రీకాళహస్తి), ఉప కార్యదర్శిగా కే.వరలక్ష్మి (కోట), కోశాధికారిగా పీ.పుష్ప(యర్రావారిపాళెం) ఎంపిక చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

పంచాయతీలు మరింత పటిష్టం

గ్రామ పంచాయతీలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఈనెల 31లోపు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. తాగునీటి బోర్లలో ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని చెప్పారు. చెత్త సేకరణ సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శులు పీఆర్‌వన్ యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. డీపీఓ సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయకుమార్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీఓ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

చంద్రగిరి: ఖాదీ మహోత్సవ ఎగ్జిబిషన్‌ను జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని, ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మార్కెటింగ్, పీఎంఈపీ-ఎగ్జిబిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి పట్టణంలోని శిల్పారామంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి వచ్చి వారి ఉత్పత్తులు ప్రదర్శించి అమ్మకాలు జరుపుతున్నారని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిల్పారామంలో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కేవీఐసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కేవీఐసీ డిప్యూటీ సీఈఓ సౌత్ జోన్ మదనకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేవీఐసీ సంస్థ సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్ ప్రైజెస్ కింద 1956లో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. దీని ద్వారా గ్రామీణ ఉత్పత్తులు, ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ శాఖ ద్వారా 26 డిపార్ట్‌మెంటల్ సేల్స్ ఔట్‌లెట్స్, 88 వేల రిటైల్ సేల్స్ ఔట్ లెట్స్, 5 సెంట్రల్ ప్లాంట్స్ ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.గ్రీప్, ఏడీ కోటిరెడ్డి, పద్మావతిపురం సర్పంచ్ జ్యోతి, లీడ్ బ్యాంకు మేనేజర్ విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ పాల్గొన్నారు.



ఖాదీ వస్త్రాల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్


సెలెస్ట్రా-25 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 28వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సెలెస్ట్రా-25 ఈవెంట్‌కు సంబంధించిన పోస్టర్లను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని విడుదల చేశారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలు తమ సరికొత్త ఆలోచనలను ప్రదర్శించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పీ.మల్లికార్జున, వీ.సరిత, డాక్టర్ ఎస్.సాయిలోహిత, బీ.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుత సంచారం



చిరుత పాదముద్రల నమూనాలు సేకరిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

తిరుపతి సిటీ: ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వద్ద చిరుత సంచరిస్తున్నట్లు విద్యార్థులు గమనించారు. బీపీఈడీ విద్యార్థులు శుక్రవారం ఉదయం 5.30 గంటలకు రన్నింగ్ ప్రాక్టీస్‌కు వెళ్తుండగా చిరుత తారసపడింది. వారు వెంటనే వీసీ, రిజిస్ట్రార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిరుత సంచరించిన ప్రాంతానికి రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఫారెస్ట్ రేంజ్ కి చెందిన బయోలజిస్టులు చేరుకున్నారు. చిరుత పులి పాదముద్రలను పరిశీలించారు. చిత్రాలు, నమూనాలను సేకరించి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు పంపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ చిరుత పులి సాధారణంగా జింకలు, కుక్కలను వేటాడడానికి వస్తుంటాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని, విజువల్స్ దొరికితే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం బోన్ ఉంచి చిరుతను బంధిస్తామని తెలిపారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులు సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత బయటకు రాకుండా హాస్టళ్లలోనే ఉండాలని రిజిస్ట్రార్ తెలిపారు. ఆహార వ్యర్థాలను రోడ్లపై పడవేయవద్దన్నారు. వర్సిటీలో కుక్కలు తిరగకుండా చూడాలని ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు, వర్కర్లు, క్యాంటీన్ యాజమాన్యాలను ఆదేశించారు. ఆదేవిధంగా వర్సిటీ రోడ్లపై తోపుడు బండ్లు ఉండకుండా చూడాలని, ఐడీ కార్డు లేని బయటి వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు.

కాలుజారిందా.. ఆత్మహత్యా యత్నమా?

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న ధర్మవరానికి చెందిన విద్యార్థి హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి కిందకి దూకాడు. ఇది ఆత్మహత్యా యత్నమా... కాలు జారిపడ్డాడా అనే విషయం తెలియాల్సి ఉంది. శుక్రవారం ఉదయం 4.30 సమయంలో హాస్టల్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకినట్లు విశ్వసనీయ సమాచారం. వెంటనే సహచర విద్యార్థులు గుర్తించి హాస్టల్ అధికారులకు సమాచారం అందించారు. నడుం భాగంలో ఎముక దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. స్థానిక వైద్యులు తమిళనాడులోని వేలూరు సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి, వెంటనే ప్రత్యేక వాహనంలో ఆ విద్యార్థిని సీఎంసీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కోటి లింగేశ్వర స్వామి సేవలో అక్కినేని అఖిల్



ఆలయం వెలుపుల ఉన్న సినీ హీరో అక్కినేని అఖిల్

కోటి లింగేశ్వరస్వామి సేవలో అక్కినేని అఖిల్

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలో వెలసిన శ్రీ కోటి లింగేశ్వర స్వామి ఆలయాన్ని సినీ హీరో అక్కినేని అఖిల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన ఆలయంలో కొలువైన శ్రీ కోటి లింగేశ్వరస్వామి, శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ కామాక్షీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు.

42 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న కేసుల్లో 42 మందికి నాలుగు లక్షల 20 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎన్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. ఇది వరలో ఎన్నడూ లేనంత విధంగా 42 మందికి నాలుగు లక్షల 20వేల రూపాయలు కోర్టు జరిమానా విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా మహేంద్ర



పుట్టా మహేంద్ర

తిరుపతి తుడా: ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా తిరుపతికి చెందిన పుట్ట మహేంద్ర ఎన్నికయ్యారు. ఆ యూనియన్ ఎన్నికలను శుక్రవారం విజయవాడలో నిర్వహించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న మహేంద్ర అదే యూనియన్‌కి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన్ను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు.

యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నా పట్టించుకోరా?

- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- రెవెన్యూ సదస్సులో ఆర్డీఓను నిలదీసిన గ్రామస్తులు





మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహన్, ఇసుక అక్రమ రవాణాపై ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తుడు

చంద్రగిరి: 'ఉచితం మాటున ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. తమ గ్రామ పరిధిలో రాత్రింబవళ్లు హిటాచీ, జేసీబీలతో టిప్పర్ల ద్వారా వందలాది లోడ్లు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు' అంటూ మండలంలోని నరిసింగాపురం గ్రామస్తులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీఓ రామ్మోహన్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సచివాలయం వద్దకు చేరుకున్నారు. స్వర్ణముఖినదిలోని ఇసుకను అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు యంత్రాలతో తవ్వేస్తున్నారని ఆరోపించారు. నరిసింగాపురం పరిధిలోని రైల్వేస్టేషన్, మసీదు సమీపం, దింపుడుగల్లం వద్ద నిరంతరాయంగా ఇసుక స్మగ్లింగ్ సాగుతోందన్నారు. ఫలితంగా గ్రామంలోని రోడ్లన్నీ దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇంటి నిర్మాణానికి కూలీల ద్వారా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకుని ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం నిబంధనలను విధించిందని, అయితే వాటికి విరుద్ధంగా యంత్రాలతో రాత్రుల్లో సైతం ఇసుకను దోచేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కొంతమంది రాత్రుల్లో రౌడీలను వెంటబెట్టుకుని ఇసుకను దోచుకుంటున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్డీఓ ఇసుక అక్రమ రవాణాపై వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివరామ సుబ్బయ్యను ఆదేశించారు. అదనపు రెవెన్యూ సిబ్బందిని నియమించి, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటికే మద్యం బండి వచ్చిందోచ్!



ఆటోలో మద్యం బాక్సులు పెట్టుకుని విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు, ఆటోలో మద్యం బాక్సులు

చిట్టమూరు (చిల్లకూరు): సాధారణంగా కూరగాయలు, ఇతర సామగ్రిని ఆటోల ద్వారా వ్యాపారులు పల్లెల్లో విక్రయించడం చూస్తుంటాం. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటింటికీ మద్యం పాలసీని అమలు చేస్తోంది. పల్లెల్లో ఆటోల ద్వారా విక్రయాలు చేసేలా 'మద్యం బండి వచ్చిందోచ్'.. అని అనౌన్స్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనే శుక్రవారం చిట్టమూరు మండలం, మొలకలపూడి గ్రామంలో చోటుచేసుకుంది. చిట్టమూరు మండలంలో నాలుగు మద్యం షాపులు ఉండగా అధికార పార్టీ నాయకులు వాటిని దక్కించుకున్నారు. షాపుల్లో విక్రయాలు తక్కువగా ఉండడంతో సిండికేట్‌గా ఏర్పడి ప్రతి గ్రామంలో బెల్టు షాపులకు తెర లేపారు. ఇంకో వైపు ఆటోల్లో ఇంటింటికీ మద్యం పంపిణీ చేసేలా ఆటోల్లో గ్రామగ్రామానికీ తిప్పుతుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా.. మొలకలపూడి గ్రామంలో ఆటోలో మద్యం విక్రయాలు చేశారన్న విషయం తమ దృష్టికి రాలేదని, విచారణ చేసి చర్యలు చేపడుతామని సెలవిచ్చారు.

క్లుప్తంగా

కల్యాణీ డ్యామ్ పరిశీలన



డ్యామ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

చంద్రగిరి/తిరుపతి తుడా : కల్యాణీ డ్యామ్‌ను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నగరానికి తాగునీరు అందించే కల్యాణీ డ్యామ్‌లో మొత్తం 900 ఎంసీఎఫ్‌టీకి గాను 310 ఎంసీఎఫ్‌టీల నీటిమట్టం ఉందని వెల్లడించారు. ప్రస్తుత నీటి నిల్వలు సుమారు 7 నెలల వరకు సరిపోతాయన్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే ప్రజలకు ఇబ్బంది ఉండదని చెప్పారు. డ్యామ్ నుంచి తిరుపతికి నీరు సరఫరా చేసే పైప్‌లైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ మధు కుమార్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎన్‌ఎస్‌యూ జట్టు



ఎంపికైన విద్యార్థులతో వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఈనెల 24 నుంచి నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్‌వర్సిటీ యోగాసన చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు జాతీయ సంస్కృత వర్సిటీ జట్టును శుక్రవారం ఎంపికచేశారు. ఈ మేరకు వర్సిటీ యోగ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో 11 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి చేతులమీదుగా ట్రాక్ సూట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగాసన ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, అధ్యాపకుడు కేసీ లోకేశ్వర్, పీడీ సేతురాం పాల్గొన్నారు.

27 నుంచి జాతీయ సాంస్కృతిక ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి కల్చరల్ : బంజార జన్ సంఘ్ ఆధ్వర్యంలో ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఈనెల 27 నుంచి రెండు రోజుల పాటు జాతీయ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బంజార జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.హరి చౌహాన్ నాయక్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పౌరాణిక పద్య, సాంఘిక నాటకాలతో పాటు జానపద, శాస్త్రీయ బృంద నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

అదో చరిత్ర



జగనన్న పాలనలో అమ్మ ఒడి పథకం కింద మా కుటుంబానికి ఏటా రూ.14వేలు అందింది. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా గడిచింది. కానీ, ప్రస్తుతం తల్లికి వందనం ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఏటా రూ.15వేల చొప్పున ఇస్తామని, ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ ఏడాది పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వంతో పోల్చుకుంటే జగనన్న పాలన స్వర్ణయుగం. అదో చరిత్ర.

- నారాయణమ్మ, తిరుపతి

పెట్టుబడికి 'భరోసా'



వ్యవసాయం దండగ కాదు పండుగ అనేలా జగనన్న పాలన సాగింది. ఖరీఫ్, రబీ రెండు సీజన్‌ల ప్రారంభంలో రైతు భరోసా పథకం కింద ఐదేళ్లపాటు రూ.13,500 నేరుగా మా ఖాతాలో జమ చేశారు. రైతుకు పెట్టుబడి కోసం దిగులు ఉండేది కాదు. దీంతో పాటు పంట రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు క్రమం తప్పకుండా రైతుభరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచేవారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో అన్నదాతా సుఖీభవ కింద ఏటా రూ.20వేలు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పైసా లబ్ధి చేకూర్చలేదు.

- చిన్న రామయ్య, చంద్రగిరి

నువ్వే కావాలి.. రావాలి



నేను విన్నాను.. నేను ఉన్నాను అనే ఒక్క మాట.. బడుగుల బతుకులను మార్చేసింది. ఆడపడుచులను ఆర్థికంగా బలోపేతం చేసింది. అవ్వాతాతల ఆత్మగౌరవానికి ఆలంబనగా నిలిచింది. అన్నదాతల అభ్యున్నతికి భరోసా కల్పించింది. విద్యార్థుల ఉన్నత భవితకు బాటలు వేసింది. అక్కచెల్లెమ్మల సొంతింటి స్వప్నాలను సాకారం చేసింది. ఆరోగ్య రక్షణతో నిరుపేదలకు ఊపిరి పోసింది. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సకాలంలో సంక్షేమ పథకాలు అందించింది. ఒక్క తిరుపతి నియోజకవర్గంలోనే సుమారు 2 లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపింది. అందుకే నవరత్న పథకాలతో వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజానీకం కొనియాడుతోంది. శనివారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని మనసారా ఆశీర్వదిస్తోంది. సూపర్ సిక్స్ పేరిట కూటమి వేసిన వలలో చిక్కుకుని నష్టపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇచ్చిన హామీని అమలు చేసే పేదల పక్షపాతి.. జగనన్నే మళ్లీ కావాలి.. మళ్లీ రావాలి అంటూ ఆకాంక్షిస్తోంది.

- తిరుపతి సిటీ

- జగనన్న పాలనలో నవరత్నాలతో పేదలకు జవసత్వాలు
- బాబు ప్రభుత్వంలో హామీలన్నీ బుట్టదాఖలు
- నాడు సంక్షేమ వెలుగులు
- నేడు తప్పని ఎదురుచూపులు

'దీవెన'తోనే చదివాడు



జగనన్న అందించిన విద్యాదీవెన పథకంతోనే ఐదేళ్ల పాటు మా అబ్బాయి చదువుకున్నాడు. బీటెక్ మూడో సంవత్సరం నుంచి ఏటా రూ.35వేలు చొప్పున నేరుగా నా ఖాతాలో జమ చేసేవారు. వెంటనే కళాశాలకు వెళ్లి ఫీజు చెల్లించేవాళ్లం. క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి దీవెన అందడంతో మాకు కళాశాల యాజమాన్యం నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండేదికాదు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మా అబ్బాయి ఎంటెక్ పూర్తి చేసి ప్రస్తుతం బెంగుళూరు టీసీఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మా కుటుంబానికి ఆదరువుగా ఉంటున్నాడు. ఇదంతా జగనన్న చలవే.

- వెంకటలక్ష్మి, తిరుపతి

కుటుంబానికి 'ఆసరా'



మాలాంటి ఎన్నో కుటుంబాలను వైఎస్సార్ ఆసరా పథకం నిలబెట్టింది. అప్పులతో సతమతమవుతున్న మాకు అండగా నిలిచి ఆదుకుంది. ఏడాదికి సుమారు రూ.17,650వరకు క్రమం తప్పకుండా జగనన్న ప్రభుత్వం మాకు అందించింది. దీంతో చిన్న టిఫిన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తూ వస్తున్నాం. అప్పులు తీర్చుకున్నాం. దీనికితోడు వైఎస్సార్ కాపు నేస్తం అందడంతో ఇంకాస్త ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. ఇప్పుడు టిఫిన్ అంగడే కుటుంబాన్ని పోషిస్తోంది. జగనన్న చేయూతతోనే అప్పుల ఊబి నుంచి బయట పడి ఊపిరి పీల్చుకుంటున్నాం.

- కృష్ణవేణి, తిరుపతి

ఆరోగ్య అభయం



మాలాంటి పేదల ప్రాణాలకు ఆరోగ్యశ్రీ పథకంతో జగనన్న అభయం ఇచ్చారు. మా కుటుంబంలో ఆరోగ్యశ్రీ కింద నా భర్తతో పాటు, కుమారుడికి ఆపరేషన్లు చేశారు. సుమారు. 5లక్షల వరకు మాకు లబ్ధి చేకూరింది. నా భర్త మేస్త్రీ పని చేసేవాడు. గుండెజబ్బు రావడంతో ఈ పథకం కిందే ఉచితంగా శస్త్ర చికిత్స చేశారు. మాలాంటి పేద బతుకులకు రూ.లక్షలు భరించే శక్తి లేదు. ఆపరేషన్ అయిన తర్వాత సైతం రెండు నెలల పాటు నెలకు రూ.3వేల వంతున ఇచ్చారు. బతికున్నంత కాలం జగనన్న మా గుండెల్లో నిలిచిపోతారు.

- సుశీలాదేవి, తిరుపతి

సొంతింటి కల నెరవేరింది



జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలలో భాగమైన పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా మాకు స్థలం వచ్చింది. అందులో ఇల్లు కట్టుకునేందుకు అప్పటి ప్రభుత్వం సహకారం అందించింది. దీంతో మా సొంతింటి కల నెరవేరింది. గతంలో ఒకటో తేదీ వస్తే చాలు బాడుగ కట్టేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. మా భర్త ఆటో డ్రైవర్, ముగ్గురు పిల్లలు నేను ఇళ్లలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. వచ్చిన ఆదాయం ఇంటి బాడుగకే సరిపోయేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు సొంత ఇంటిలో ఉన్నాం. జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం.

- నాగరత్నమ్మ, తిరుపతి రూరల్

ఏంటీ రుబాబు!



- కార్పొరేషన్ కార్యాలయంలో హల్‌చల్
- కాంట్రాక్ట్ పనుల్లో పెత్తనం
- రగిలిపోతున్న టీడీపీ, జనసేన నేతలు

సాక్షి టాస్క్ ఫోర్స్ : తిరుపతిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన పెత్తనం ఎక్కువైంది. ×నేను సీఎం చంద్రబాబుకు సమీప బంధువుని ...సీఎంఓలో నేను చెప్పిందే వేదం... ఇక్కడ ఏ పని చేయాలన్నా నా అనుమతి తప్పనిసరి.. నేను చెప్పిన వారికే కాంట్రాక్ట్ వర్క్‌లు కేటాయించాలి.. కాదని ఎవరైనా ధిక్కరిస్తే బదిలీ చేయిస్తా₹₹ అంటూ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ పేర్లు చెప్పుకుంటూ అందరినీ హడలెత్తిస్తున్నారు. సదరు వ్యక్తి పేరు కూడా చంద్రబాబు నాయుడు కావడమే విశేషం. ఈ తిరుపతి ×బాబు₹గారు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యథేచ్ఛగా దూరేస్తున్నారు. అధికారుల పనుల్లో వేలు పెట్టేస్తున్నారు. నయానో భయనో అందరినీ లొంగదీసుకుని తన పనులన్నీ కానిచ్చేసుకుంటున్నారు. ఇటీవల తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో కొన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పడ్డాయి. అత్యవసరం కావడంతో టెండర్ల కంటే ముందే కొన్ని పనులను చేపట్టారు. ఈ క్రమంలో చంద్రబాబు నాయుడు అనే వ్యక్తి టెండర్ల విషయంలో మితిమీరిన జోక్యం చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే సిఫార్సుతో జనసేనకు చెందిన కొంతమంది టెండర్లలో పాల్గొనడంతో మొత్తం టెండర్లను సదరు చంద్రబాబు నాయుడు సిండికేట్గా మార్చేశారు. దీంతో జనసేన అనుకూలవర్గానికి ఒక్క పని కూడా దక్కలేదు. జరిగిన అన్యాయంపై వారు ఆవేదన చెందుతూ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. చంద్రబాబు వైఖరిపై ఎమ్మెల్యే మండిపడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు టీడీపీ, జనసేనకు చెందిన కొందరు నేతలు జోక్యం చేసుకుని మధ్యస్థం నడుపుతున్నట్లు సమాచారం.

పర్సంటేజీ కోసం పోరు

కాంట్రాక్ట్ పనులకు సంబంధించి పర్సంటేజీల కోసం టీడీపీ, జనసేన నేతల నడుమ పోరు సాగుతున్నట్లు తెలిసింది. స్థానిక చంద్రబాబు పెత్తనంపై ఇరుపార్టీల నాయకుల్లోనూ అసంతృప్తి వెల్లువెత్తుతోంది. ఈ క్రమంలో బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. తమకు ప్రాధాన్యత లేకుండా చంద్రబాబు పెత్తనం సాగించడంపై మండిపడుతున్నారు.

నేడు జగనన్న పుట్టినరోజు వేడుకలు

తిరుపతి మంగళం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం తిరుమల బైపాస్‌రోడ్డులోని టీఎంఆర్ కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10గంటలకు కేక్ కటింగ్ ఉంటుందని, తర్వాత రక్తదాన శిబిరం, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

చంద్రగిరి: స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు జగనన్న పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.

బ్రహ్మర్షి ఆశ్రమంలో రాజస్థాన్ మంత్రి



ఆశ్రమంలో హీరాలాల్ నాగర్

రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురం బ్రహ్మర్షి ఆశ్రమంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవాలకు శుక్రవారం రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నాగర్ హాజరయ్యారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గురువానంద గురూజీ ఆశీస్సులు పొందారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు



శ్రీరంగపట్నం పంపుతున్న బస్సులతో ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : అవసరమైన వారికి ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తామని, ఓ బృందంగా వస్తే కోరిన ప్రాంతాలకు సర్వీసులను పంపుతామని తిరుపతి డీఎం బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పలువురు భక్తుల కోరిక మేరకు శ్రీరంగపట్నం తదితర ప్రాంతాల యాత్రకు మూడు సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే శుభ కార్యాలకు సైతం బస్సులు ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీడీఎం విశ్వనాథం పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

తిరుపతి అర్బన్ : జిల్లావ్యాప్తంగా సాగుతున్న భూ ఆక్రమణలపై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, కార్యదర్శి జయచంద్ర ఫిర్యాదు చేశారు. ప్రధానంగా తడ మండలం కొండూరులో కబ్జాలపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

'క్యాట్'లో మెరిసిన విద్యార్థులు



మోక్షజ్ఞ | భవ్యశ్రీ నిషిత | జి.వంశీయాదవ్ | కె.హారిక రాజు | పి.శ్రీనిధి

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) ఫలితాల్లో తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం ఈ మేరకు కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మట్టం మోక్షజ్ఞ 93.38, భవ్యశ్రీ నిషిత 92, జి.వంశీయాదవ్ 90.93, కె.హారిక రాజు 85, పి.శ్రీనిధి 83.7పర్సంటైల్ స్కోర్లు సాధించినట్లు వెల్లడించారు. క్యాట్ ఉచిత గైడెన్స్‌కు 96981 23456 నంబరులో తమను సంప్రదించాలని కోరారురు. సత్తా చాటిన విద్యార్థులను విద్యాసంస్థ ప్రతినిధులు ఎస్.హరి, ఎస్‌ఎస్ రెడ్డి అభినందించారు.

మెకానిక్‌ల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి కల్చరల్: మెకానిక్‌ల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ పనిచేస్తున్నట్లు టూవీలర్స్ మెకానిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ భవన్‌లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు . ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన మెకానిక్ మధు, జలంధర్ వైద్య ఖర్చులకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. సంఘం ప్రతినిధులు లక్ష్మణరావు, ప్రభు, మల్లీశ్వర్, గురు ఆచారి, బాబు, సోమశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అనుచితం



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి కల్చరల్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యా ఖ్యలు అనుచితమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మండిపడ్డారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నీతి, నిజాయితీ, నిబద్ధత గల అంబేడ్కర్‌ను అమిత్‌షా హేళన చేయడం సిగ్గుచేటన్నారు. మోదీ, పరిపాలనలో ప్రజాస్వామ్యం బలహీనంగా మారిందని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, వెంకటేష్ గౌడ్, సమీవుల్లా, కుమార్ పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

పాకాల : అంబేడ్కర్‌ను దూషించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే కేబినెట్ నుంచి బర్త రఫ్ చేయాలని అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు గుండ్ల పల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రకాష్(గణేష్), కోశాధికారి శివప్రసాద్, రామయ్య, కృష్ణమూర్తి, రాజేంద్ర, నరసింహులు, ప్రభు, శ్రీరాములు, రామూర్తి, జ్యోతిప్రసాద్, డాక్ట ర్ రామకృష్ణ, ఉదయకుమార్, ఆదికేశవులు, అబ్దుల్‌శబీర్, నాగరాజ, గోపి, వెంకటస్వామి, బంగారురాజు, జయబాల, సుధాకర్, రామచంద్రన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి : మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ వాసురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

28 నుంచి 'పిల్లల పండుగ'

తిరుపతి కల్చరల్ : నగరంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి రెండు రోజులపాటు పిల్లల పండుగ నిర్వహించనున్నట్లు తిరుపతి బాలోత్సవం ప్రతినిధి మల్లారపు నాగార్జున తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్షాలు, విద్యార్థులకు పరీక్షల కారణంగా 21న ప్రారంభించాల్సిన పండుగ తేదీని మార్పు చేసినట్లు వెల్లడించారు. బాలోత్సంలో పాల్గొనదలచిన వారు శనివారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకుని, తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.



తిరుమల ఎస్‌ఎంసీ సర్కిల్, బాలాజీ బస్టాండ్ వద్ద..

కొండంత గుంతలు!



తిరుమల రెండో ఘాట్‌రోడ్‌లో..



ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో రహదారులు గుంతలమయంగా మారాయి. ఘాట్ రోడ్లు సైతం దెబ్బతిని ప్రమాదకరంగా తయారయ్యాయి. కొండపై పలు ప్రాంతాల్లో వాహనాలు వేగంగా వస్తూ గుంతలో పడి అదుపు తప్పుతున్నాయి. దీంతో పలువురు యాత్రికులకు గాయాలవుతున్నాయి. ఈ క్రమంలో టీటీడీ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని శ్రీవారి భక్తులు కోరుతున్నారు. వరుసగా కురస్తున్న వర్షాల నేపథ్యంలో దారులు మరింత దారుణంగా మారకముందే తగు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

- తిరుమల